నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 8 డిసెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

## తెలంగాణకు ఏడు నవోదయ విద్యాలయాలు..
# బీఆర్ఎస్ పోరాట ఫలమే: నామా



ఖమ్మం, డిసెంబర్ 7: తెలంగాణకు కేంద్రం ఏడు నవోదయ విద్యాలయాలు మంజూరు చేయడం బీఆర్ఎస్ పోరాట ఫలితమేనని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష మాజీ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. తెలంగాణకు 21 నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని తాము కోరితే కేంద్రం ఏడు నవోదయ విద్యాలయాలను మాత్రమే మంజూరు చేసిందని అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఏర్పడ్డాక పాలనా సౌలభ్యం కోసం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూతనంగా ఏర్పడిన జిల్లాలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటుచేయాలన్న అంశాన్ని 17వ లోక్‌సభలో తాను అనేకమార్లు ప్రస్తావించినట్లు చెప్పారు. కేంద్రమంత్రులకు లేఖలు రాశానని, పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చించానని, ప్రశ్నలు లేవనెత్తానని, పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద బీఆర్ఎస్ ఎంపీలం నిరసనకు దిగామని గుర్తుచేశారు. తమ పోరాట ఫలంగానే తెలంగాణకు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏడు నవోదయ విద్యాలయాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు.

# వివరాల సేకరణలో పొరపాట్లు ఉండొద్దు

## ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, డిసెంబర్ 7 : ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా క్షేత్రస్థాయి వివరాల సేకరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌పై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ కుటుంబం బీపీఎల్ కేటగిరీకి చెందినదై ఉండాలని, లబ్ధిదారు సొంత స్థలం లేదా ప్రభుత్వం ఇచ్చిన స్థలం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రాధాన్యతా క్రమం చూపాలన్నారు. పేర్లు, ఇంటి నెంబర్లు, డాక్యుమెంట్ల నమోదులో తప్పులు దొర్లకుండా కచ్చితమైన డాటా పొందుపర్చాలన్నారు. దరఖాస్తుదారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి ఏయే వివరాలు, ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలో అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ పంచాయతీ వార్డు కార్యాలయాల్లో ఆయా వివరాలను ఫ్లెక్సీల్లో ప్రదర్శించాలన్నారు. ప్రతిరోజు కనీసం 30 దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకోవాలన్నారు. ఈడీఎం దుర్గాప్రసాద్.. యాప్ ఇన్‌స్టాలేషన్, యాప్ ఉపయోగించే విధానం, లైవ్ ఉదాహరణలతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో రాజేశ్వరి, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీవో ఆశాలత, ఆర్డీవోలు నర్సింహారావు, ఎల్.రాజేందర్, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం లేవు..!

**రేషన్ లబ్ధిదారులకు త్వరలో సన్నబియ్యం ఇస్తామని గొప్పలు చెప్పకుంటున్న కాంగ్రెస్ సర్కార్ ప్రస్తుతం దొడ్డు బియ్యం ఇచ్చేందుకే ముక్కుతున్నది. ప్రతి నెలా 1వ తేదీ నాటికే డీలర్లకు బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. డిసెంబర్ నెల ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా 10 శాతం కూడా చేయలేకపోయింది. బియ్యం స్టాక్ లేక ఎస్ఎఫ్‌సీ, ఎంఎల్ఎస్ గోదాములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 43,638 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉండగా.. ఇప్పటివరకు కేవలం 3 వేల టన్నుల లోపు మాత్రమే డీలర్లకు చేరాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు మిల్లుల చుట్టూ తిరుగుతూ బియ్యం కోసం బతిమిలాడుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏదేమైనా ప్రతినెలా సకాలంలో రేషన్ బియ్యం అందక నిరుపేదలు మాత్రం తీవ్ర అవస్థలు పడుతున్నారు.**

**- అశ్వారావుపేట, డిసెంబర్ 7**

- ఖాళీగా దర్శనమిస్తున్న సివిల్ సప్లయ్ గోదాములు
- భద్రాద్రి జిల్లాకు కావాల్సింది ప్రతి నెల 43,638 టన్నులు
- రేషన్ డీలర్లకు ఈ నెల ఇప్పటివరకు 3 వేల టన్నులే సరఫరా
- నెలనెలా పరిస్థితి దిగజారుతున్న వైనం
- మిల్లర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అధికారులు
- సకాలంలో బియ్యం అందక నిరుపేదల అవస్థలు

నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యానికి కరువు పరిస్థితులు నెలకొన్నాయి. రేషన్ దుకాణాలకు సరఫరా చేయాల్సిన గడువు ముగిసినా పూర్తిస్థాయిలో బియ్యం డీలర్లకు చేరడం లేదు. సర్కార్ గోదాములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రతి నెలా 20వ తేదీ నుంచి నెలాఖరు వరకు డీలర్లకు నిర్దేశిత బియ్యం సరఫరా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ.. ప్రతి నెలా బియ్యం సరఫరాలో లక్ష్యం చేరుకోలేక అధికారులు మిల్లర్ల చుట్టూ ప్రదక్షిణలు చేసుకుంటూ బతిమిలాడుకుంటున్నారు. గత నెల కంటే ఈ డిసెంబర్ నెల బియ్యం సరఫరాలో మరింత దుర్భర పరిస్థితులు నెలకొన్నాయంటూ పౌర సరఫరాల శాఖపై డీలర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గడిచిన పదేళ్లలో ఇటువంటి క్లిష్ట పరిస్థితులను ఎప్పుడూ చూడలేదంటూ అసహనం వెలిబుచ్చుతున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి ప్రారంభించి 15వ తేదీ నాటికి లబ్ధిదారులకు పంపిణీ పూర్తి చేయాల్సి ఉంది. అయితే సరిపడా బియ్యం అందక పంపిణీని నిర్ణీత గడువులోగా ఎలా పూర్తిచేయాలో అర్థంకాక డీలర్లు సతమతమవుతున్నారు. గత మూడు నెలలుగా బియ్యం లేక గోదాములు నిండుకుంటున్నాయని వాపోతున్నారు. సాధారణంగా ప్రతి నెలా పౌర సరఫరాల శాఖాధికారులు 23వ తేదీ నుంచి నెలాఖరు వరకు గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు, అక్కడ ఉండి రేషన్ డీలర్లకు సరఫరా చేస్తారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15 వరకు రేషన్ డీలర్లు లబ్ధిదారులు బియ్యం పంపిణీ చేస్తారు. డీలర్ల వద్ద ఉండే ఈ-పాస్ మిషన్లు కూడా 15వ తేదీ సాయంత్రం ఆన్‌లైన్ ఆఫ్ అయిపోతుంది. అయితే గత నెలలో కూడా 15వ తేదీ వరకు బియ్యం సరఫరా చేయడంతో డీలర్లు నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేశారు. ఇందుకు ఈ-పాస్ మిషన్లను అధికారులు అందుబాటులో ఉంచారు.



లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

### 43,638 మెట్రిక్ టన్నులు అవసరం..

జిల్లాలో నిరుపేదలకు పంపిణీ చేయడానికి డిసెంబర్ నెలకు మొత్తం 43,638.27 మెట్రిక్ టన్నుల బియ్యం డీలర్లకు సరఫరా కావాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 443 రేషన్ దుకాణాల పరిధిలో 2,93,268 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో అంత్యోదయ 21,149, అన్నపూర్ణ 3, ఫుడ్ సెక్యూరిటీ 2,72,116 కార్డులు ఉన్నాయి. వీటికి అవసరమైన 43,638.27 మెట్రిక్ టన్నుల బియ్యం డీలర్లకు అందలేదు. ఇప్పటివరకు ఈ నెల కేవలం 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అందాయి. వీటితోనే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. మిగతా బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. అధికారులు మాత్రం ఇతర జిల్లాల నుంచి బియ్యం దిగుమతి చేసుకోవడానికి దృష్టి సారిస్తూనే మరోవైపు మిల్లర్ల చుట్టూ తిరుగుతూ బతిమిలాడుకుంటున్నారు. గత కేసీఆర్ సర్కార్ హయాంలో ఇటువంటి పరిస్థితులను ఎప్పుడూ చూడలేదంటూ అధికారులు, డీలర్లు చెబుతున్నారు.



దమ్మపేటలో ఖాళీగా దర్శనమిస్తున్న ఎంఎల్ఎస్ పాయింట్

### ముందుచూపు లేకనే..

రేవంత్‌రెడ్డి సర్కార్ అసమర్థత, ముందుచూపు లేమి కారణంగానే గోదాములు ఖాళీ అయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత పదేళ్లలో కేసీఆర్ సర్కార్ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి వాటిని సీఎంఆర్ కోసం మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించి నిర్దేశిత సమయంలో బియ్యం తీసుకుని గోదాముల్లో నిల్వ చేసింది. ప్రతి నెలా డీలర్లకు నిర్ణీత గడువులోగా బియ్యం సరఫరా చేసి లబ్ధిదారులకు అందించడంలో ఎటువంటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం రేషన్ బియ్యం సేకరణ కష్టంగా మారింది. పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులు మిల్లుల చుట్టూ తిరుగుతున్నారు. బియ్యం కోసం మిల్లర్ల పట్ల కొంత కఠినంగా కూడా వ్యవహరిస్తున్నారనే వాదనలు ఉన్నాయి. ఈ పరిస్థితులు ఇంకెన్ని నెలలు ఉంటుందోనని డీలర్లు ఆందోళన చెందుతున్నారు.

### బియ్యం రాలేదు..

దమ్మపేట జీసీసీ పరిధిలో మొత్తం 50 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం నిల్వలు లేవు. రోజూవారీగా ఇతర జిల్లాల నుంచి వస్తున్న బియ్యంను డీలర్లకు సరఫరా చేస్తున్నాం. ఇప్పటివరకు 500 మెట్రిక్ టన్నుల బియ్యంకు గాను 200 టన్నులకు పైగా డీలర్లకు అందించాం. మిగతా బియ్యం వచ్చిన వెంటనే సరఫరా చేస్తాం.

**– కె.పాపారావు, జీసీసీ మేనేజర్, దమ్మపేట**

### హమాలీల సమస్య ఉంది..

ఇతర జిల్లాల్లో హమాలీల సమస్య కారణంగా బియ్యం సకాలంలో అందలేదు. జిల్లాలో ఇప్పటికే 3 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 443 మంది రేషన్ డీలర్లకు సరఫరా చేశాం. స్థానికంగా బియ్యం అందుబాటులో లేక ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. లబ్ధిదారులకు ఎటువంటి సమస్య లేకుండా బియ్యం పంపిణీ చేస్తాం.

**– త్రినాథ్, డీఎం, సివిల్ సప్లయీస్, కొత్తగూడెం**



కళాశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# గిరిజన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

## భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బూర్గంపహాడ్, డిసెంబర్ 7 : గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. శనివారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని కృష్ణసాగర్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. 10వ తరగతి వరకు చదివి పై చదువులు చదవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థుల కోసం వసతి సౌకర్యాలతో మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించేందుకు ఈ స్థలాన్ని పరిశీలించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పాలిటెక్నిక్ కోర్సు చేయడానికి ఇక్కడ అవకాశం లేకపోవడంతో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషి మేరకు ఇక్కడ పాలిటెక్నిక్ కళాశాల మంజూరైందన్నారు. ప్రస్తుతం కళాశాల మణుగూరులో నడుస్తున్నదని, ఇక్కడ కళాశాల నిర్మించేందుకు ప్రభుత్వ భూమి పదెకరాలు అవసరమైనట్లు తెలిపారు. గురుకుల కళాశాల సమీపంలో సిబ్బంది నివాసగృహాలు పురాతనంగా మారడంతో వాటిని కూలగొట్టి ఈ ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. కళాశాల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేసి మణుగూరు నుంచి ఇక్కడకు కళాశాలను తరలించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలలో మెనూ కచ్చితంగా అమలుచేస్తున్నారా... లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు క్రీడా పరికరాలను త్వరలో అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగముని నాయక్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సులు పెంచాలని 'మాస్‌లైన్' ధర్నా

## ఇల్లెందు బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



ఇల్లెందు బస్సు డిపో ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ఇల్లెందు, డిసెంబర్ 7 : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇల్లెందు ఆర్టీసీ డిపో ఎదుట నాయకులు శనివారం ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి మాట్లాడుతూ ఇల్లెందు నుంచి ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హైదరాబాద్‌తోపాటు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వేలాది బస్సులను రద్దు చేయడంతో గ్రామీణ ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రద్దు చేసిన బస్సులను వెంటనే పునరుద్ధరించాలని, మాణిక్యారం, ఎల్లన్ననగర్, వీరాపురం, మశివాగు, చీమలపాడు, చెట్టుపల్లి, బోడు, కారేపల్లి, గంగారం తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడిపించాలని కోరారు. ఇల్లెందు బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలని, ఇంధన సౌకర్యం, మెకానిక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు అజ్మీరా బిచ్చ, బుర్ర రాఘవులు, పాయం వెంకన్న, ఎదలపల్లి సావిత్రి, ముత్తక్క, ధర్మన్న, వాంకుడోత్ శంకర్, శాంతారావు, మల్లెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'సీతారామ' నీటికోసం పాదయాత్ర

## ఇల్లెందు నుంచి భద్రాచలం బయలుదేరిన సేవాలాల్ సేన



ఇల్లెందులో నినాదాలు చేస్తున్న నాయకులు

ఇల్లెందు, డిసెంబర్ 7 : సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతుల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన జిల్లా కమిటీ అధ్యక్షుడు శివనాయక్ ఆధ్వర్యంలో ఇల్లెందు నుంచి భద్రాచలం వరకు శనివారం పాదయాత్ర చేపట్టారు. ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో సేవాలాల్ రైతు సేన రాష్ట్ర కన్వీనర్ కిషన్‌నాయక్.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కుమ్రం భీం విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్, శివనాయక్ మాట్లాడుతూ రైతుల పంట భూములకు నీరందించాలనే డిమాండ్‌తో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ యాత్ర ఇల్లెందు పట్టణం నుంచి టేకులపల్లి, పాల్వంచ క్రాస్ రోడ్డు, పాల్వంచ పట్టణం మీదుగా సోమవారం ఉదయం భద్రాచలం చేరుకుంటుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిసి వినతిపత్రం అందజేయడంతో యాత్ర ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్ననాయక్, బానోత్ హుస్సేన్‌నాయక్, అంగోత్ ఆంజనేయులు, సతీశ్, వంశీ, వీరన్న, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

# సోయగాల పూబెల్లి

- ఆ పల్లె చుట్టూ ప్రకృతి అందాలు
- పచ్చదనం పరిచినట్టు పంట పొలాలు
- చూపరులను కట్టిపడేస్తున్న ఎత్తైన కొండలు
- మైమరిపిస్తున్న కొండపక్కన చెరువు
- ఆ ఊరిలో 180 కుటుంబాలు నివాసం
- ఉట్టిపడుతున్న పల్లె జీవన విధానం
- పర్యాటక కేంద్రంగా చేస్తామన్న జిల్లా బాస్

"అందాలలో అహో మహోదయం.. భూలోకమే నవోదయం" అనే జగదేకవీరుడు.. అతిలోక సుందరి సినిమాలోని పాట గుర్తుకు వస్తుంది పూబెల్లి ప్రకృతి సోయగాలు చూస్తే.. ఆ ఊరు చుట్టూ ఎత్తైన కొండలు, కొండలపై నుంచి వెళ్తున్న మేఘాలు, పల్లె సోయగాలతోపాటు చెరువు జలసవ్వడి, కొండల నడుమ పచ్చదనం పరచినట్లు ఉంటుంది. ఉదయం 5గంటలకే ఊరి జనాలు నిద్రలేచి తమ పనుల్లో నిమగ్నమవ్వడం.. పాడి పశువులు కొండల వద్ద పచ్చగడ్డి తింటున్న దృశ్యాలు కళ్లను కట్టిపడేస్తాయి.. అక్కడికి వెళ్తే మరలా బిజీ ప్రపంచంలోకి రావాలంటే మనసు కొంత వెనకడుగు వేస్తుంది.. ఇక 'పూబెల్లి' గ్రామ విశేషాల్లోకెళ్తే..

– ఇల్లెందు రూరల్, డిసెంబర్ 7



ఊరు మధ్యలో ఉన్న చెరువు అందాలు



ఊరు చుట్టూ పరుచుకున్న పచ్చదనం, కొండలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో ఉంది పూబెల్లి గ్రామం. మండల కేంద్రం ఇల్లెందుకు 10 కిలో మీటర్ల దూరం. ఆ గ్రామంలో సుమారు 180 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఆ ఊరు అందాలను చూసి స్వయంగా జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ మంత్రముగ్ధులయ్యారు. పూబెల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఊరి మధ్యలో ఉన్న చెరువులో బోటు షికారు ఏర్పాటు చేస్తే సందర్శకుల తాకిడితో పాటు గ్రామాల్లోని ప్రజలు, యువతకు జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. దీనికోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇల్లెందు పట్టణానికి దగ్గరలో పర్యాటక కేంద్రం లేదు. పోతే కిన్నెరసాని పోవాలి లేకుంటే భద్రాచలం పాపికొండలకు వెళ్లాలి. దగ్గరలో ఎలాంటి పర్యాటక కేంద్రం లేదు. ప్రకృతి సోయగాలు, అందాలు, ఆనందాలు, ఆహ్లాదాలు కలిగిన పూబెల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తే ఇల్లెందులోపాటు చుట్టుపక్కల ఉన్న మహబూబాబాద్, బయ్యారం, కొత్తగూడెం, ఇతర గ్రామాల నుంచి సందర్శకులు పెద్దఎత్తున తరలివస్తారు. కుటుంబ సభ్యులు ప్రకృతి ఆనందాలను ఆస్వాదిస్తూ కూర్చొని వేడి ఆహారాన్ని స్వీకరించేలా మంచెల ఏర్పాటుతోపాటు చెరువులో బోటు షికారు సౌకర్యం కల్పిస్తే రానున్న రోజుల్లో పూబెల్లి పర్యాటక కేంద్రంగా పరిఢవిల్లుతుందని ఆ గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.

### యువతకు ఉపాధి దొరుకుతుంది..



మా గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తే యువతకు ఉపాధి దొరుకుతుంది. ఎక్కడో పట్టణానికి వలస వెళ్లకుండా ఇక్కడే పుట్టిన గ్రామంలో ఉంటూ జీవనోపాధిని పొందవచ్చు. మా కుటుంబ సభ్యులను పోషించుకోవచ్చు. ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాం. ఎదుగుతున్న పిల్లలు ఉన్నారు. ఎంతో ఆనందం, ఆహ్లాదం ఉన్న మా పూబెల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తే సందర్శకుల తాకిడి పెరుగుతుంది. ఆర్థికపరంగా మా కుటుంబాలు బాగుపడుతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

**– మూతి చంటి, పూబెల్లి గ్రామస్తుడు**

### కలెక్టర్ గారు హామీ ఇచ్చారు..



కలెక్టర్ గారు మొన్న మా ఊరికి వచ్చారు. ప్రకృతి సోయగాల నడుమ ఉన్న పచ్చని మా పల్లెను చూసి ఎంతో పరవశించిపోయారు. మాతో కొద్దిసేపు ముచ్చటించి పర్యాటకకేంద్రంగా చేస్తే ఎలా ఉంటుంది, ఏమేమి వసతులు ఉంటే బాగుంటాయో అడిగి తెలుసుకున్నారు. పర్యాటక కేంద్రాన్ని చేసేందుకు ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. నిజంగా ఆనందంగా ఉంది.

**– కల్తి శ్రీహర్షిణి, పూబెల్లి గ్రామస్తురాలు**

### మా ఊరికి గుర్తింపు వస్తే గర్వపడుతా..



మా ఊరును పర్యాటక కేంద్రంగా చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పేరు వస్తుంది. పుట్టిన ఊరికి గుర్తింపు వస్తే గర్వపడతాను. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ దిశగా ఆలోచిస్తే మంచి ఆదాయం సమకూరడంతోపాటు మాకు జీవనోపాధి లభిస్తుంది. త్వరలోనే పర్యాటక కేంద్రంగా మా ఊరు మారుతుందని నమ్ముతున్నా.

**– మూతి సావిత్రి, పూబెల్లి గ్రామస్తురాలు**